క్లుప్తంగా

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



బంటుమిల్లి: విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపించి, ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని, తద్వారా వారికే కాకుండా, వారు చదువుకున్న విద్యాసంస్థకు కూడా పేరు ప్రఖ్యాతలు వస్తాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సోమవారం ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, బాగ్స్, నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. ఎంపీపీ వెలివెల చినబాబు, సర్పంచ్ వి.కృష్ణవేణి, ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు నాగాయలంక మండల పరిషత్ సమావేశం

నాగాయలంక: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జేకే సీతారామ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భోగాది రాఘవారాణి అధ్యక్షతన మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ సమావేశంలో 21 శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందని సంబంధిత మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ మచిలీపట్నం సబ్‌డివిజన్ ఈఈ మన్నెం భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మండలంలోని అరిసేపల్లి, చిట్టిపాలెం, హుస్సేన్‌పాలెం, బొొర్రపోతుపాలెం, గోకవరం, రెడ్డిపాలెం, సిరివెళ్లిపాలెం, మంగినపూడి, తపసిపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జీజీహెచ్‌లో రోగులకు మజ్జిగ పంపిణీ

మచిలీపట్నంటౌన్: స్థానిక జీజీహెచ్ ఉద్యోగి తల్లపరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రిలోని ఓపీ విభాగం వద్ద రోగులు, వారి సహాయకులకు మజ్జిగ అందజేశారు. సోమవారం ఎండ బాగా కాయటంతో పాటు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న రోగులు, వారి సహాయకులకు ఉపశమనం కలిగించేందుకు శ్రీనివాసరెడ్డి తన తల్లిదండ్రులు వెంకటనర్సిరెడ్డి, వరలక్ష్మి జ్ఞాపకార్థం మజ్జిగను అందజేశారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆసుపత్రి ఆర్ఎంవో నిరంజన్‌కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ జి.భానుమూర్తి ప్రారంభించారు.

చివరి భూములకు సాగునీరు అందించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు

కోడూరు: దివిసీమలోని తీరప్రాంత చివరి భూములకు ప్రభుత్వం వెంటనే సాగునీటిని అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. మండలంలోని దిగువ కాలువలను స్థానిక నేతలతో కలిసి సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అనంతరం సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రామకృష్ణాపురం, ఇరాలి, హంసలదీవి, ఉల్లిపాలెం, పాలకాయతిప్ప, సాలెంపాలెం, మందపాకల, పోటుమీద గ్రామాల్లోని చివరి భూములకు నేటి వరకు సాగునీరు చేరలేదన్నారు. రైతులు పొలాలను బీడు పెట్టుకుని నీటి కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పై గ్రామాల్లో నారు మళ్లు పోసుకొనేందుకు కూడా కాలువల్లో నీరు లేదని, ఓ వైపు వరదలతో లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతుంటే తీరప్రాంత కాలువల పరిస్థితి ఇలా ఉండటానికి ప్రభుత్వ అసమర్థతే కారణమని నరసింహారావు విమర్శించారు. పాలకాయతిప్ప, ఉల్లిపాలెం అవుట్ ఫాల్ స్లూయిస్‌లు శిథిలావస్థకు చేరడంతో ఉప్పునీరు పొలాల్లోకి చొచ్చుకువచ్చి పొలాలు చౌడుబారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చివరి భూములకు సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలని నరసింహారావు కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వై.మధు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కరిముల్లా, మండల అధ్యక్షుడు పోలాబత్తిన మోహనరావు, కొప్పనాతి తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెవెలుగు స్థానంలో మెట్రో ఎక్స్‌ప్రెస్ కొనసాగించాలి

ఘంటసాల: ప్రతి రోజు ఉదయం 6.40 గంటలకు విజయవాడ నుంచి ఘంటసాల గ్రామానికి వచ్చే 333 జీఎస్ మెట్రో ఎక్స్‌ప్రెస్‌నే కొనసాగించాలని కోరుతూ ఘంటసాల, మొవ్వ మండలాలకు చెందిన పలువురు ఉద్యోగులు విజయవాడకు చెందిన ఎన్టీఆర్ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ (డీపీటీవో)కు సోమవారం అర్జీ సమర్పించారు. మెట్రో ఎక్స్‌ప్రెస్ స్థానంలో ఇటీవల పల్లె వెలుగు బస్సు నడపడంతో ఉద్యోగులు, విద్యార్థులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారన్నారు. మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సును పునరుద్ధరించాలని ఆ వినతిపత్రంలో కోరారు.

ఏవో పేరుకే...వీఏఏలే దిక్కు!

- కార్యాలయానికి రాని ఇన్‌చార్జి ఏవో
- రైతు సేవా కేంద్రానికి తాళం వేసి ఏఓ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న వీఏఏలు, ఎంపీఈవోలు
- ఖరీఫ్ సీజనులో రైతులకు అందుబాటులో లేని వ్యవసాయాధికారి



ఏవో కార్యాలయం



ఏవో కార్యాలయంలో రైతుకు సమాధానం చెబుతున్న వీఏఏ(ఫైల్)

పెడన: అసలే ఖరీఫ్ సీజన్.. అంతా నాట్లు వేసి, పంటలకు కావాల్సిన ఎరువులు జల్లుకుంటున్నారు. మరో పక్క వ్యవసాయ శాఖ ఈకేవైసీ, ఈ–క్రాప్, కౌలు గుర్తింపు కార్డుల జారీ, సబ్సిడీపై ఎరువులు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో మండల వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా పెడన కార్యాలయానికి రావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిన్న మొన్నటి వరకు చార్జి తీసుకోలేదని చెబుతూ వచ్చిన ఆమె చార్జి తీసుకున్న తర్వాత కూడా కార్యాలయానికి రాకపోవడంపై రైతులు విమర్శిస్తున్నారు. మిచాంగ్ తుపాను నష్ట పరిహారం పంపిణీలో జరిగిన అవకతవకల నేపథ్యంలో పెడన మండల వ్యవసాయ శాఖ కుదేలైంది. తుపాను నష్ట పరిహారం పంపిణీకి ముందు వ్యవసాయశాఖలో సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండటమే కాకుండా ఈకేవైసీ, ఈ–క్రాప్, కౌలు గుర్తింపు కార్డుల జారీ వేగవంతంగా ఉండేది. మిచాంగ్ నష్టపరిహారం పంపిణీలో చోటు చేసుకున్న అవకతవకల అనంతరం ఇద్దరు వీఏఏలు, ఏవో సస్పెండ్ కావడంతో మచిలీపట్నం అగ్రిల్యాబ్‌లో విధులు నిర్వహించే నూరున్నీసాకు పెడన ఏవో ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. అంతకు ముందు పనిచేసిన ఏవో బాధ్యతలను అప్పగించలేదనే చెబుతూ చాలా రోజుల వరకు ఆమె బాధ్యతలను స్వీకరించలేదు. ఆ తర్వాత బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా ఏవో కార్యాలయానికి రావడంలేదు.

ఏవో కార్యాలయంలో వీఏఏలే దిక్కయ్యారు!

ఏవో కార్యాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లే విధులు నిర్వహిస్తున్నారు. రోజుకు ఇద్దరు వీఏఏలు విధులు నిర్వహించాలని ఇన్‌చార్జి ఏవో ఆదేశాలు జారీ చేయడంతో వారి గ్రామ సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్రానికి తాళాలు వేసి ఒక రోజు ఏవో కార్యాలయంలో విధులు నిర్వహించడానికి వస్తున్నారు. గ్రామంలో వీఏఏలు అందుబాటులో ఉండటం లేదని, తాళం వేసి మండల కేంద్రానికి పోతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 10 మంది వీఏఏలు, ఇద్దరు ఎంపీఈఓలు ఉన్నారు. వీరిపైన ఇద్దరు ఏఈవోలు, ఒక ఇన్‌చార్జి ఏవో విధులు నిర్వహిస్తున్నారు.

ఖరీఫ్ సీజనులో అందుబాటులో లేకపోతే ఎలా?

సీజన్ ప్రారంభం కావడంతో రైతులు తమ పంట పొలాలను ఈ క్రాప్ చేయించడంతో పాటు ఈకేవైసీ చేయించాలి. కౌలు రైతులు తమ కార్డులను రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంది. కొందరు కొత్తగా తీసుకోవాలి. ఇటువంటి వారికి వ్యవసాయశాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటం లేదనే వాదన రైతుల నుంచి వినిపిస్తోంది. కొన్ని సమయాల్లో ఏవో కార్యాలయానికి వెళ్లినా కొందరు వీఏఏలు అరకొరగా సమాచారం తెలియజేసే పరిస్థితి ఉందని, పూర్తిస్థాయిలో సమాచారం ఇచ్చే ఏవో ఉండాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.

సమావేశాలుండి రావడం లేదు

కలెక్టరేట్‌లో సమావేశాలుండి రావడం లేదు. ఏవో కార్యాలయంలో వీఏఏలకు బాధ్యతలను అప్పగించాం. ఇద్దరు చొప్పున ఉంటున్నారు. ఏవో కార్యాలయానికి వచ్చే రైతులకు వారు సమాచారం తెలియజేస్తున్నారు. రైతు సేవా కేంద్రానికి వారంలో ఒకరోజే తాళం వేస్తున్నారు. మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటున్నారు.

– నూరున్నీసా, ఇన్‌చార్జి ఏవో, పెడన

పచ్చమూకల దాడి బాధితులకు బాసట

బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేసిన పేర్ని కిట్టు



చెక్కును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ని కిట్టు, సలార్‌దాదా, అచ్చెబా

మచిలీపట్నంటౌన్: ఎన్నికల ఫలితాల అనంతరం మచిలీపట్నం నియోజకవర్గంలో పచ్చమూకల దౌర్జన్యానికి గురైన వైఎస్సార్ సీపీ శ్రేణులను ఆ పార్టీ ఆదుకుంటోంది. దీనిలో భాగంగా నియోజకవర్గానికి చెందిన ఆరుగురు పార్టీ కార్యకర్తలకు పార్టీ నుంచి వచ్చిన చెక్కులను పేర్ని కిట్టు సోమవారం పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. నగరంలోని 27వ డివిజన్‌కు చెందిన ఎండీ తౌసిఫ్, ఎండీ నౌషద్‌లకు రూ.50 వేల చొప్పున చెక్కులను అందజేశారు. 40వ డివిజన్‌కు చెందిన కుందేటి మంగమ్మకు రూ.50 వేలు, 39వ డివిజన్‌కు చెందిన వీరంకి వెంకటకృష్ణకు రూ.50 వేలు అందజేశారు. సుల్తానగరానికి చెందిన గట్టె రవీంద్రబాబుకు లక్ష రూపాయలు, పోతేపల్లికి చెందిన ప్రత్తి చంద్రశేఖర్‌కు రూ.50 వేలు అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, మాడపాటి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ పల్లి శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు చిత్తజల్లు రాజు, షేక్ మొహమ్మద్ సాహెబ్, గాజుల భగవాన్, గోళ్ల పాండురంగారావు, తరకటూరు సీతారాముడు, బడే భానుతేజ, బూరగ రామారావు, చలమలశెట్టి గాంధీ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిప్పళ్ల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలోకి ఎవరూ వెళ్లొద్దు

తహసీల్దార్ బి.విజయ ప్రసాద్



శ్రీకాకుళంలోని కృష్ణానది ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ ప్రసాద్, వీఆర్వో శ్రీనివాసరావు

శ్రీకాకుళం(ఘంటసాల): కృష్ణానదిలో వరద ఉధృతి నేపథ్యంలో ఎవరూ నదిలోకి వెళ్లడానికి వీల్లేదని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామం వద్ద కృష్ణానదిలో వరద ఉధృతిని తహసీల్దార్ విజయ ప్రసాద్ వీఆర్వో తూము శ్రీనివాసరావుతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కృష్ణానది వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున శ్రీకాకుళంలోని పుష్కర్ ఘాట్‌లో నీరు చేరడంతో పాటు కృష్ణా–గుంటూరు జిల్లాల మధ్య ఉన్న దారి నీటిలో కొట్టుకుపోయిందన్నారు. శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాలకు చెందిన రైతులు లంక భూముల్లో పంటల కోసం వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారని, వరద ఉధృతి తగ్గేవరకు ఎవరూ నదిలోకి వెళ్లేందుకు అనుమతుల్లేవన్నారు. రైతులు, గ్రామస్తులు, విద్యార్థులు ఎవరూ నది పరివాహక ప్రాంతానికి రావొద్దని, పశువులను, మేకలను మేపడానికి అవకాశం లేదని తెలిపారు. కృష్ణానదిలో వరద ఉధృతి తగ్గేంతవరకు ప్రజలు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ విజయ ప్రసాద్ కోరారు.



పచ్చందాలతో ఆహ్లాదకరంగా ఉన్న ఉప్పలూరి రాధాకృష్ణమూర్తి పార్కు

ఆహ్లాదం...ఆనందం

స్వచ్ఛ నాగాయలంక సొసైటీ కార్యకర్తల నిస్వార్థ స్వచ్ఛంద శ్రమదాన ఉద్యమంలో భాగంగా కొత్త రూపుతో సుందరంగా రూపుదిద్దుకున్న స్థానిక ఉప్పలూరి రాధాకృష్ణమూర్తి ఉద్యానవనం(పార్కు) స్థానికులకు ఆహ్లాదాన్నిస్తోంది. పిల్లలకు ఆటవిడుపుగా ఉయ్యాల బల్లలు, ఇతర ఆట పరికరాలు ఏర్పాటుచేయడంతో సాయంత్రం వేళల్లో చిన్నారులకు ఈ ఉద్యానవనం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అలాగే పెద్దలకు సేదతీరడానికి సిమెంటు బల్లలు కూడా ఉండడంతో పెద్దలు కాసేపు ముచ్చట్లు చెప్పుకుని సేదతీరుతున్నారు. స్థలదాత రాధాకృష్ణమూర్తి కుటుంబసభ్యులు కూడా స్వచ్ఛ నాగాయలంక కృషిని ఈ సందర్భంగా అభినందిస్తున్నారు. స్వచ్ఛ కార్యకర్తల శ్రమదాన కృషికి అద్దం పట్టినట్లు సుందరంగా రూపుదిద్దుకున్న ఈ ఉద్యానవనం సంరక్షణ బాధ్యతను పంచాయతీ పాలకవర్గం మరింత శ్రద్ధగా చూస్తోంది.

–నాగాయలంక



దాతలు సమకూర్చిన చిన్నారుల ఆట పరికరాలు

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు

లంకపల్లి(ఘంటసాల): గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు తమ వంతు సహకారం అందించాలని వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, సర్పంచ్ డి.విజయలక్ష్మి కోరారు. ఘంటసాల మండలం లంకపల్లి పంచాయతీ కార్యదర్శిగా నూతన బాధ్యతలు స్వీకరించిన కందుల నాగ నాంచారమ్మ, బదిలీపై ఘంటసాలపాలెం వెళ్లిన బోలెం అర్జునరావులకు సర్పంచ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పాలకవర్గం, పంచాయతీ, సచివాలయ సిబ్బంది సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇరువురినీ దుశ్శాలువాలు, పూలమాలలతో సర్పంచ్ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ నాగరాజు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ మస్తాన్ వలి, సిబ్బంది ఘనంగా సన్మానించారు. వార్డు సభ్యుడు మాధవరావు, గ్రామస్తులు కొల్లూరి పద్మారావు, కొండపల్లి ఆంజనేయులు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్ఐ చినబాబుకు సత్కారం

చల్లపల్లి(అవనిగడ్డ): బదిలీపై వెళ్లిన చల్లపల్లి ఎస్ఐ చినబాబును సోమవారం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మేడేపల్లి సుబ్బారావు, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

19న బాలాపార్వతీ అమ్మవార్లకు గాజుల అలంకారం

టేకుపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని టేకుపల్లి గ్రామంలో శ్రీ బాలా పార్వతీ సమేత రామేశ్వరస్వామివారి దేవస్థానంలో ఈనెల 19వ తేదీ అమ్మవారికి గాజుల అలంకారం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం గాజుల అలంకారం, సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల భక్తులు అమ్మవారి అలంకరణకు గాజులు ఇవ్వదలచినవారు సేవాకర్తలుగా ఈనెల 17వ తేదీ లోపు దేవాలయంలో సమర్పించాలని సూచించారు.

పొలాల పక్కన చెత్త వేయకుండా చూడండి

అవనిగడ్డ: మండల పరిధిలోని ఎడ్లంకలో ఉన్న బందలాయిచెరువు ఎస్సీ కాలనీకి చెందిన విజయ భాస్కర సొసైటీ పొలాల పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ జి.మురళీధర్‌కు సొసైటీ సభ్యులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ సభ్యుడు బడుగు జ్ఞానానందం మాట్లాడుతూ పంటపొలాల పక్కనే స్థానికులు చెత్త, వ్యర్థ పదార్థాలు వేయడం వల్ల పందులు, కుక్కలు, పందికొక్కులు, ఎలుకలు వచ్చి వాటిని పంటపొలాల్లో లాక్కెళ్లడం, పంటను నాశనం చేయడం వల్ల నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సొసైటీ సభ్యుడు బి.శివకృష్ణ ఉన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు సౌండ్ సిస్టం బహూకరణ



హైస్కూల్‌కు మైక్ సిస్టం అందించిన గోపాలకృష్ణను సన్మానిస్తున్న హెచ్ఎం వేణుగోపాలరావు, సిబ్బంది

గోగినేనిపాలెం (ఘంటసాల): దాతలందరి సహకారంతో గోగినేని పాలెం జెడ్పీ హైస్కూల్‌ను ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని హైస్కూల్ హెచ్ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్‌కు పూర్వ విశాఖపట్నంకు చెందిన సాయి రిసార్ట్స్ అధినేత, పూర్వ విద్యార్థి అయిన దండమూడి రామకృష్ణ ప్రసాద్ రూ.50 వేల విలువైన డిజిటల్ సౌండ్ సిస్టం విత్ వైర్‌లెస్ స్పీకర్లను గ్రామ ప్రముఖుడు అత్తలూరి గోపాలకృష్ణ చేతుల మీదగా ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలరావుకు సోమవారం అందజేశారు. హెచ్ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ హైస్కూల్‌కు మైక్ సిస్టం బహూకరించిన దాత రామకృష్ణ ప్రసాద్‌కు, సహకరించిన పెద్దలు గోపాలకృష్ణకు హైస్కూల్ విద్యా కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ త్రిమూర్తులు మృతి

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి పేర్ని నాని, ఉప్పాల రాము



త్రిమూర్తులు అంత్యక్రియల్లో పాల్గొన్న పేర్ని నాని, ఉప్పాల రాము తదితరులు

పెడన: మాజీ మున్సిపల్ కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ భళ్ల జ్యోత్స్నరాణి బావ, కౌన్సిలర్ బళ్ల గంగయ్య సోదరుడు బళ్ల త్రిమూర్తులు(55) శనివారం చెన్నైలో మరణించారు. అక్కడ నుంచి భౌతికకాయాన్ని పెడనలోని ఆయన స్వగృహానికి ఆదివారం సాయంత్రం తీసుకురాగా సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. త్రిమూర్తులు మరణవార్త తెలిసి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము), మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారు ఆనందప్రసాద్, పలువురు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పుర ప్రముఖులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో త్రిమూర్తులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో పేర్ని నాని, ఉప్పాల రాము, పలువురు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేస్తాం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



నషా ముక్త్ అభియాన్ ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచి యక్కల మాధవి

మచిలీపట్నంటౌన్: మత్తుపదార్థాల నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని స్థానిక పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు సోమవారం ప్రతిన బూనారు. విద్యాలయం ఆవరణలో సోమవారం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతోందన్నారు. దేశంలో డ్రగ్స్ వినియోగాన్ని తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

గూడూరు: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సంకల్పం చేయాలని కప్పలదొడ్డి సర్పంచి యక్కల మాధవి పిలుపునిచ్చారు. నషాముక్త్ అభియాన్‌లో భాగంగా సోమవారం కప్పలదొడ్డి పంచాయతీలో డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిస అవడం వల్ల యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. తద్వారా దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో అడపా నరేష్, సచివాలయాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

తెలుగురావుపాలెం(ఘంటసాల): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు అన్నారు. ఘంటసాల మండలం తెలుగురావుపాలెం గ్రామ సచివాలయంలో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిస్తామంటూ సోమవారం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ యువత పెడదారి పట్టడంతో సమాజం చెడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చేయి చేయి కలిపి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి బి.అశ్వినికుమార్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ కె.రేవంత్, డిజిటల్ అసిస్టెంట్ కె.శివకృష్ణ, మహిళా పోలీస్ బి.నాగలక్ష్మి, ఏఎన్ఎం జె.వీరవనిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముంపు నీరు పోయేందుకు కాల్వల ఏర్పాట్లు



మురుగునీరు పోయేందుకు జేసీబీతో కాల్వలు తీయిస్తున్న నాయకులు

గూడూరు: కప్పలదొడ్డి వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు ముంపు బారిన పడిన ప్లాట్లలోని నీరు పోవడానికి యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఇటీవల గ్రామంలో పర్యటించినప్పుడు స్థానికులు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాలనీలో వరదనీరు బయటకు పోయేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సర్పంచి యక్కల మాధవి, మాజీ సర్పంచి కట్టా మునేశ్వరరావు జేసీబీ సహాయంతో కాలనీలో ముంపు నీరు బయటకు పోయేందుకు కాల్వలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీడీవో మారుతీ శేషమాంబకు ఘన సన్మానం



ఎంపీడీవో మారుతీ శేషమాంబను సత్కరిస్తున్న సిబ్బంది

ఘంటసాల: ఘంటసాల ఎంపీడీవోగా పనిచేస్తున్న బి.మారుతీ శేషమాంబ బదిలీపై గుంటూరు జిల్లా వెళ్తున్న సందర్భంగా ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది, ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు సోమవారం సాయంత్రం ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఏవో కేజే శ్రీనివాస చంద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఆరు నెలల్లో ఘంటసాల మండలంలో ఎన్నికల సమర్థంగా జరిగేందుకు కృషి చేయడంతో పాటు పెన్షన్ల పంపిణీ, ఉపాధి హామీ పథకం 100 రోజుల పనుల్లో కృష్ణాజిల్లాలో ఘంటసాల మండలాన్ని మొదటిస్థానంలో ఉంచేందుకు కృషి చేశారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఎంపీడీవో మారుతీ శేషమాంబ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మారుతీ శేషమాంబను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

మూగ బాలుడు పోలీసులకు అప్పగింత



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బాలుడు

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలో రహదారులపై ఒంటరిగా సంచరిస్తున్న ఓ మూగబాలుడిని సోమవారం స్థానికులు పోలీసులకు అప్పగించారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో సుమారు ఐదేళ్ల బాలుడు స్థానిక చెమ్మనగిరిపేట శివాలయం వద్ద చేతిలో ఐస్‌క్రీమ్ పట్టుకుని రోడ్డుకు అడ్డుగా పరిగెడుతూ కనిపించాడు. అక్కడ ఉన్న పలువురు బాలుడ్ని ఆపి వివరాల కోసం ప్రయత్నించగా మూగవానిగా గుర్తించారు. దీంతో ఆ బాలుడిని ఓ పత్రికా విలేకరి రాబర్ట్‌సన్‌పేట పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు

నాగాయలంక: గ్రామంలోని శ్రీపార్వతీ సమేత శ్రీ కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని సోమవారం కన్యకాంబ, పార్వతీదేవిలకు విశేష పూజలు నిర్వహించారు. తొలుత వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. భావదేవరపల్లి శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశ్వేశ్వర స్వామికి అభిషేక మహోత్సవం నేత్రపర్వంగా జరిపారు. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ క్రోవి సత్యనారాయణ నేతృత్వంలో అన్నపూర్ణదేవికి శ్రావణ పూజలు నిర్వహించి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.